ఎంపీ అసదుద్దీన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

యాకుత్‌పురా: పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా జై పాలస్తీనా అంటూ వ్యాఖ్యలు చేసిన మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కే. మహేశ్వర్ డిమాండ్ చేశారు. యాకుత్‌పురా బ్రహ్మణ్‌వాడీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సభ్యుల అనర్హతకు సంబంధించి రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 102 డీ ప్రకారం రాష్ట్రపతి చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలో అన్ని పదవులు అనుభవిస్తూ పరాయి దేశానికి జై కొట్టడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం


పోలీసు సైరన్ అక్రమంగా అమర్చిన కారు

గోల్కొండ: నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ అస్పాక్ అహ్మద్ అన్నారు. గోల్కొండ బడాబజార్, చోటే బజార్, ఫతే దర్వాజ తదితర ప్రాంతాల్లో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ బోలేరో వాహనం పోలీసు సైరన్‌తో అటువైపు వచ్చింది. కాగా పోలీసులు దానిని ఆపి పరిశీలించారు. పోలీసు సైరన్‌ను ప్రైవేట్ కారుపై ఎందుకు పెట్టావని డ్రైవర్ సేరియాజ్ అలీఖాన్‌ను ప్రశ్నించారు. ఇది చట్టరీత్యా నేరమని అంతేగాకుండా ఈ వాహనం ముజాయిద్ అలీఖాన్ పేరుపై ఉందని పోలీసులు ఆయనకు స్పష్టం చేశారు. కాగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు సేరియాజ్‌పై కేసు నమోదు చేశారు.

బాధ్యతల స్వీకరణ

యాకుత్‌పురా: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్–7 ఇన్‌చార్జి డీసీగా సురేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు డీసీగా విధులు నిర్వహించిన శివకుమార్ మూసీనది పరీవాహక అభివృద్ధి సంస్థకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో చాంద్రాయణగుట్ట సర్కిల్ డీసీగా విధులు నిర్వహిస్తున్న సురేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.

కరాటేతో స్వీయ రక్షణ


శిక్షణ పత్రాలతో విద్యార్థులు

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ పి.గణేష్ నాయక్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో వేసవిలో శిక్షణ పొందిన ఉప్పుగూడలోని జేకేఆర్ హైస్కూల్ విద్యార్థులకు జీహెచ్‌ఎంసీ సర్టిఫికెట్లను బుధవారం ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం జి.అక్షయ్ కుమార్, జి.కాంతారావు అభినందనలు తెలిపారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు


ఆలయంలో టీన్ షెడ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు చేస్తున్నదని గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్ వివేకానందనగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో రూ.7.50 లక్షలతో నిర్మించిన నూతన టీన్ షెడ్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సలహాదారులు డి.రాజు, ఆలయ అధ్యక్షుడు కె.యాదయ్య, కమిటీ సభ్యులు సి.రాజ్ కుమార్, టి.గోవింద్, పి.కిశోర్, కె.వెంకటేశ్, కె.ఎల్లేష్, ఎ.వినోద్, జె.సురేందర్, ఎస్.ఉదయ్ భాస్కర్, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


బాలకృష్ణను సన్మానిస్తున్న చంద్రశేఖర్ తివారి

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వం 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఎంతో మంది బీజేపీ నాయకులు పోరాడి జైలుకెళ్లారని అలాంటి నాయకులను గౌరవించి సన్మానించుకోవడం గర్వంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ తివారి అన్నారు. ప్రజాస్వామ్యానికి చీకటి రోజుల పేరుతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గాదేపాగ బాలకృష్ణతో పాటు మరికొందరని సన్మానించారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కృషి చేస్తున్నదని ప్రొఫెసర్ కోదండరాం, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీకి చెందిన మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కోదండరాం, చిన్నారెడ్డి హాజరై మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తుందన్నారు. ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కార్మికులందరికీ 125 గజాల స్థలంతో పాటు హెల్త్‌కార్డులు కూడా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హన్మంతరావు, కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జనక్‌ప్రసాద్, బాబర్ సలీం పాషా, విజయ్‌కుమార్ యాదవ్, ప్రకాశ్ గౌడ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో కోదండరాం, చిన్నారెడ్డి, ఆదిల్ షరీఫ్ తదితరులు


నాంపల్లి ఏరియాసుపత్రి దగ్గర ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న కంకర, ఇసుక

ఫుట్‌పాత్‌లే వ్యాపార కేంద్రాలు..!

- నాంపల్లిలోయథేచ్ఛగా ఆక్రమణ
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

నాంపల్లి: నాంపల్లి ఏరియాసుపత్రి చుట్టూ కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు. రోజులు కాదు.. వారాలు కాదు.. నెలలు కాదు.. ఏకంగా సంవత్సరాల తరబడి వాటిపైనే అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. బజార్ ఘాట్‌లోని బాబు జగ్జీవన్ రామ్ డిగ్రీ కళాశాల వెనుక ఫుట్‌పాత్‌ను కబ్జా చేసి కంకర, ఇసుక, ఇటుక, సిమెంట్, రాళ్లు డంప్ చేసి విక్రయిస్తున్నారు. ముర్గీ మార్కెట్, మాసాబ్ ట్యాంక్ జేఎన్‌ఎఫ్‌ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల వద్ద, అలాగే విజయనగర్‌కాలనీ నుంచి నాంపల్లి రైల్వేస్టేషన్ వరకు ఫుట్‌పాత్‌లే కనుమరుగయ్యాయి. దారి పొడవునా పండ్లు, పూలు, పాలు, నీళ్ల వ్యాపారులు కొనసాగుతున్నాయి. ఈ రహదారి ఎప్పుడూ వీఐపీలతో రద్దీగా ఉంటోంది. ఇక్కడి ఫుట్‌పాత్‌లను ఆక్రమణకు గురికాగా పాదచారులు రోడ్లమీదనే నడకను సాగిస్తున్నారు. ఫలితంగా తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని అరికట్టాల్సిన జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు అందినకాడికి దండుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనదారుడు హెల్మెట్ పెట్టకపోతేనే చలాను విధించే ట్రాఫిక్ పోలీసులకు ఏళ్ల తరబడి దర్జాగా ఫుట్‌పాత్‌లు కబ్జా చేసి వ్యాపారాలు చేస్తుంటే కనిపించడం లేదా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇంత బహిరంగంగానే అక్రమ వ్యాపారాలు జరుగుతుంటే నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బజార్‌ఘాట్‌లోని ముత్యాలమ్మ ఆలయ చౌరస్తా నుంచి సింగరేణి భవన్ వరకు రోడ్డుకిరువైపులా అల్మారాలు తయారు చేయడం, మెకానిక్ షెడ్లు, కొబ్బరి బోండాల విక్రయాలు, హోటల్స్ నిర్వహణ పనులు చేస్తున్నారు. వీరి వల్ల ప్రజలు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలాఉంటే కారు షెడ్ల నిర్వాహకులు కొందరు పదుల సంఖ్యలో కార్లను రోడ్ల పైనే నెలల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఇటు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఫుట్‌పాత్ కబ్జాలను అరికట్టి అక్రమ వ్యాపారాలను శాశ్వతంగా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తాం..

నాంపల్లి ఏరియాసుపత్రి చుట్టూ ఫుట్‌పాత్‌ల ఆక్రమణను అడ్డుకుంటాం. కబ్జా చేసి కొందరు వ్యాపారాలు చేస్తూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో వాటిని క్లియర్ చేసి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం.
– ట్రాఫిక్ సీఐ, కిరణ్‌కుమార్

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు


హకీంపేట్‌లో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, బల్దియా అధికారులు

గోల్కొండ: వర్షాకాలం ప్రారంభమైనా అధికారులు నాలా పూడికతీత, పైపులైన్ పనులు పూర్తి చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఎస్‌ఎన్‌డీపీ, బల్దియా అధికారులతో కలిసి టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాలా, పైపులైన్ పనులను పరిశీలించి నత్తనడకన సాగుతుండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుల్కాపూర్ నాలా పూడికతీత పనులు వేగవంతం చేయాలని టోలిచౌకీ, బాల్‌రెడ్డి నగర్, రియాసత్‌నగర్, ఎండీ లైన్స్ తదితర ప్రాంతాల్లో వరద నీటి పైపులైన్ పనులు సైతం యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఎన్‌డీపీ చీఫ్ ఇంజినీర్ కోటేశ్వర్‌రావు, ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫారస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న శివ కుమార్

గౌలిపురా: గౌలిపురాలోని రోజరీ గ్రామర్ హైస్కూల్ పూర్వ విద్యార్థి కావేటి ప్రణయ రాజ్ 17వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయరాజ్ జ్ఞాపకార్థం తండ్రి, ఆర్టీఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కావేటి గోవిందరాజ్ ఆధ్వర్యంలో పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివ కుమార్ హాజరై పేద విద్యార్థుకు ఉచితంగా నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ఉపాధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, కార్యదర్శి కొంతం సురేశ్ బాబు, ఆకుల సదానంద్, ప్రధాన కార్యదర్శి చుక్కా అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు సున్నం అశ్విన్, తోట అశోక్, రుద్రొట్టి నవీన్, రాష్ట్ర మున్నూరు కాపు యువకమండలి అడ్‌హాక్ కమిటీ సభ్యులు కావేటి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి


సుల్తాన్‌షాహీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జఫర్‌హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్లు

యాకుత్‌పురా: ఆభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులను ఆదేశించారు. తలాబ్ చంచలం, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, నస్రీన్ సుల్తానా, పలువురు అధికారులతో కలిసి బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. తలాబ్‌కట్టా, జహంగీర్ నగర్, మురాద్ మహల్, సుల్తాన్‌షాహీ, క్యూబా మసీద్, మొఘల్‌పురా ఓల్డా హోటల్ తదితర ప్రాంతాల్లో పనులను పరిశీలించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో పాటు స్థానిక మజ్లిస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి


బహుమతులు పొందిన చిన్నారులతో డీఎం కృష్ణారెడ్డి

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ సంస్థ ఆదాయం పెంపునకు సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ డిపో–1 మేనేజర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సీవీ సజ్జనార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'లక్ష లక్ష్యం' లో భాగంగా ప్రతిరోజూ ప్రతి డిపోలో రూ లక్ష ఆదాయం పెంచేలా చూడాలన్నారు. బుధవారం డిపో1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన ముగ్గురు చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, అసిస్టెంట్ ఇంజినీర్ ధనంజయ రావు, డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఎస్.దినేశ్ కుమార్ అన్నారు. గన్‌ఫౌండ్రీలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈశ్వరమ్మపై జరిగిన దాడి కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలన్నారు. అదేవిధంగా షాబాద్ మండలం కేసారం గ్రామంలో దళిత విద్యార్థిపై దాడి చేసినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువతుల అదృశ్యం

అత్తాపూర్: వేర్వేరు చోట్ల ఇద్దరులు యువతులు బుధవారం అదృశ్యమయ్యారు. ఓ యువతి కళాశాలకని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మరో ఘటనలో ఇంట్లో అందరూ నిద్ర పోయిన తర్వాత అదృశ్యమైంది. ఈ ఘటనలు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లోని పాండురంగానగర్‌కు చెందిన బి.జ్యోతి(20) మేనమామ సంగమేశ్వర్ ఇంట్లో ఉంటూ డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 22వ తేదీన ఉదయం 9 గంటల సమయంలో కళాశాలకు అని ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మామ సంగమేశ్వర్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హుడాకాలనీకి చెందిన యువతి..

రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని హుడా కాలనీకి చెందిన మోహి ఉన్నిసా రఫత్(18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 17న రాత్రి 9 గంటలకు భోజనం చేసి ఇంట్లో అందరు పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం 4 గంటలకు కుటుంబ సభ్యులు ఇంట్లో చూడగా.. మోహి ఉన్నిసా రఫత్ కనిపించలేదు. బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసుంధర విజ్ఞాన వికాస మండలి వార్షికోత్సవం


పురస్కారాలు అందజేస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి 31వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగినటువంటి వసుంధర విజ్ఞాన వికాస మండలి రానున్న రోజుల్లో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో దక్కన్‌ల్యాండ్ సంపాదకుడు వేదకుమార్, రచయితల సంఘం అధ్యక్షులు నాలేశ్వరం శంకరం, వసుంధర విజ్ఞాన వికాస మండలి అధ్యక్షులు మధుకర్ వైద్యుల చదువు వెంకట్‌రెడ్డి, కట్కూరి శంకర్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బోనాల విజయవంతానికి సహకరించాలి


అమ్మవార్లకు పూజలు చేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: ఆషాఢమాసం బోనాలు విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ కోట నగీనాబాగ్‌లో సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నర్సింగ్‌రావుతో పాటు బంజారాదర్వాజకు చెందిన బాబురావు, మహంకాళి ఆలయ పూజారి బి.సురేశ్‌చారి, బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి ఉన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవ వేడుకలు


సీఎంను కలిసిన అనంతోజ్ హన్స్‌రాజ్

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయం పునర్ నిర్మాణం 25వ వార్షికోత్సవ వేడుక లు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు కమి టీ కోశాధికారి అనంతోజ్ హన్స్‌రాజ్ తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానించామని పేర్కొన్నా రు. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా గురువారం పవిత్రోత్సవం, మహాభిషేకం, చండీహోమం, స హస్ర నామ కుంకుమార్చన తదితర పూజా కార్యక్ర మాలతో ఉత్సవాలు ప్రారంభించనున్నామని తెలిపారు. ఈసారి 25 రోజుల పాటు నిరంతరాయంగా అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్యోగుల ఐక్యకార్యాచరణతోనే తెలంగాణ సాధన


టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతలను సత్కరిస్తున్న గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

నాంపల్లి: టీఎన్జీఓ కేంద్ర సంఘం, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘానికి మధ్య అన్నదమ్ముల అనుబంధం ఉందని టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం ఎ.కె.గౌడ్ ఫంక్షన్ హాలులో తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన టీఎన్జీఓ కేంద్ర సంఘం కార్యవర్గ నేతలను సత్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షు డు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌ను గజమాలతో సత్కరించి అభినందించారు. అనంతరం మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ సంఘటితంగా ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల ఐక్యకార్యాచరణతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీఎన్జీఓ కేంద్ర సంఘం నేత రామినేని శ్రీనివాస రావు, హైదరాబాదు జిల్లా నేతలు కె.ఆర్.రాజ్‌కుమార్, కురాడి శ్రీనివాస్, తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు వర్కల సత్యనారాయణ, లక్ష్మణ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది అవినీతి పాలన'


ర్యాలీగా ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: కాంగ్రెస్ ఏడు నెలల పాలనలోనే అవినీతి రాజ్యమేలుతుందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. అబిడ్స్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి జూబ్లీహిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు పెద్ద ఎత్తున బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యాదవ్ మాట్లాడుతూ.. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కుంభకోణాలకు పాల్పడ్డారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించడం నిజమే అని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతి లీలలు త్వరలోనే బహిర్గతం చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి, సీతారామ వీరాంజనేయ స్వామి వార్ల ఆలయాల 17వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతి స్వామి కల్యాణోత్సవం, వీరాంజనేయ స్వామికి విశేష అభిషేకం, తమల పాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు అధికార, అనధికార ప్రముఖులు, భక్తులతో పాటు దేవాలయ ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాసాచారి, ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శర్మ, ధార్మిక సలహాదారులు చల్లా మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్, మహేశ్వరం శ్రీనివాసాచారి

మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీ



మాట్లాడుతున్న ఏఎస్సై సత్యనారాయణ


ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ్, ఎస్‌హెచ్‌ఓ మధుబాబు

అబిడ్స్: మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనార్థలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధూల్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ విజయ్, ఎస్‌హెచ్‌ఓ మధుబాబు జెండా ఊపి ప్రారంభించారు. ధూల్‌పేట్ జాలి హనుమాన్ నుంచి బల్‌రామ్‌గల్లీ, అజారి హోటల్, లోధ్‌భవన్, బడా బంగ్లా, మచిలిపురా తదితర ప్రాంతాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్గొని మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎక్సైజ్ అధికారి సీహెచ్ విజయ్, ఎస్‌హెచ్‌ఓ మధుబాబు మాట్లాడుతూ..మాదకద్రవ్యాలను నిరోధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గోపాల్, ఎస్ఐలు విష్ణు, సైదులు, మధు, ఉమామహేశ్వర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలబస్తీలోని ప్లే గ్రౌండ్‌లో..

నాంపల్లి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలబస్తీలోని ప్లే గ్రౌండ్‌లో ప్రజా చైతన్య సభను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాసాబ్‌ట్యాంక్ ఏఎస్సై సత్యనారాయణ హాజరై మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని కోరారు. కార్యక్రమంలో బత్తుల మనోహర్ బాబు, సయ్యద్ ఫసీ హుస్సేన్, సుధాకర్, రత్నాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

గౌలిపురా: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు వి.సుధాకర్ శర్మ అన్నారు. తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పాతబస్తీ గౌలిపురాలోని జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సు, ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చెడు స్నేహితులతో డ్రగ్స్‌కు బానిసై యువత తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావేత్త, జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్, రిటైర్డ్ ఎంఈఓ వి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజానికి నడుం బిగించాలన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాది వి.రమేశ్ కుమార్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తూ డ్రగ్స్ సేవించడంతో ఆరోగ్యం, సమాజంపై జరిగే పరిణామాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్, పాతబస్తీ తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ శాఖ అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ శాస్త్రి, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బి.వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్